
# టెలిఫోనులో సాధన

పోతుకూచి సాంబశివరావు



టక్... టక్... టక్...

గుఱ్ఱపు డెక్కల చప్పుడు—

జూలుగుర్రం – తెల్ల గుర్రం – నల్ల గుర్రం – గోధుమరంగు, తెల్లమచ్చల గుర్రం—వీటిమీద స్వారినేర్చుకున్నాడు—జీవితంలో వీటిమీద ఆధారపడి బ్రతుకు పై చక్కటి స్వారి నేర్చుకున్నాడు – కలిసివచ్చిన కాలంలో కనకవర్షం కురిసింది. శ్యామసుందర్‌కు అదొక వ్యసనమైంది – గుఱ్ఱప్పందాల కోసం పందెంవేసుకు పరుగెత్తడం—కాని ఈ నాడు కాలుజారింది – కనకం పాలిపోయింది – ఒక తప్పుఎత్తుతో పదివేలు నష్టం – అయినా పెద్ద ప్రమాదంలేదు – గడించిన ధనం ముందు – పెంచిన వ్యాపారం ముందు– ఏమిటో బాధ – మనస్సులో బల్లెపు పోటులు – మెదడు మెలికలు తిరుగుతోంది.

బోయ్!....బీర్!....

గ్లాసులు చప్పుడు – సీసాలు కాళీ—మైకం – పోయి—అందమైన హోటలు రూము స్వర్గసీమలా ఊగుతోంది – ఏదో సముద్రంలో – చీకటిలో – అలలమీద తేలుతున్న ఓడలా—అంతా తేలిక.

క్రిణ్....క్రిణ్....క్రిణ్....

ఊ....

'ఎవరో శకుంతల....మీతో మాటాడతారట.'

ఊ....

మైకంలో శ్యామసుందర్ ఎర్రని కళ్ళు మెరిసాయి....ఈ క్రొత్త నగరంలో....తెలియని పరిస్థితులలో—ఎవరా పిలిపు? నవ్వుకున్నాడు....హోటలు మేనేజరు కంఠం అదృశ్యం! 'నమస్కారమండి!'

'నమస్తే!'

'నా పేరు....'

'తెలిసింది'-ఆమె నవ్వింది హాయిగా!

బలే పసందుకాలం—శ్యామసుందర్ పెదిమలు నృత్యంచేశాయి....

"మీరునటించిన 'అమాయకపు పిల్ల' సినీమా చూశాను."

'నేనా?....' శ్యామసుందర్ ముద్ద మొహం ఆలోచనలో పడింది.

'మీరేగా!...అబద్ధమాడతారెందుకూ-మీ నటన అంటే నాకు చాలా యిష్టం–'

శ్యామసుందర్ అప్రయత్నంగా చిటిక వేశాడు...

'అహ! అలాగా....మంచిది!'

'మీరు ఎన్నాళ్ళనుంచీ సినీరంగంలో నటిస్తున్నారు'

'అప్పుడే ఏడేళ్ళనుంచి—'


'మీ సినీమాలు చూస్తే...మా యింట్లో అందరికీ చాలా యిష్టం—మొన్న ఒక స్నేహితురాలు చెప్పింది....మీరీవూళ్ళో హోటల్లోఉన్నారని..విన్నా..నాకు ఫోను చేయడం సరదా....చేశా నంతే!....'

'బాగుంది....మీ రేం చేస్తున్నారు!'

'చదువుకుంటున్నా....మా క్లాసులో ఎప్పుడూ మీ సినీమాల గురించే చర్చ—అబ్బ చంపేస్తారండి స్నేహితులంతా...మీరు బ్రహ్మాండంగా నటిస్తారట....మీరు హాలీవుడ్ వెళ్ళిపోతే బాగుంటుందండి!'

'ఏం – నేను యిక్కడ వుండడం మీ కిష్టంలేదా?'

'అబ్బే అదికాదండీ....మీరు చాలా హాస్యంగా మాట్లాడుతారా....బాగుంది



...మీరునటిస్తూంటే, నాకు మీతో నటించాలని ఉంది!....'

'అలాగా....మీరూ నటిస్తారా'....

'సినీమాలో చేరాలని వుందండి....కాని మా అమ్మా నాన్నా ఒప్పుకోరు....చదువుకోవా లంటారు....మొన్న మా కాలేజీలో 'ఎరుకసాని'గా నటించానండీ...నా కొక కప్పు బహుమతి యిచ్చారు.'

'నా కంటె మెరుగు – చిన్నప్పుడు నే నెప్పుడూ నటించలేదు - హఠాత్తుగా సినీమాలోకి లాక్కెళ్లారు !'

'అలాగాండి .... మీ వయస్సు ఎంతండి?.... మే మంతా మీకు పాతికేళ్లు ఉంటాయనుకుంటాం....మా స్నేహితురాలు లలిత మీ బొమ్మ కనిపిస్తే చాలు ప్రతీపత్రిక కొంటుంది ? మా తమ్ముడు మీ ఫొటో లన్నీ మా యింట్లో గోడల నిండా అంటించేడు....ఇదీ సంగతి....'

'చాలాబాగుంది .... ఈ హోటలుకు ఒకసారి రండి !'

'అబ్బే ! వీలుపడదు..నాకు యింట్లో సంకెళ్లు....కాని ఫోనులో మాట్లాడతా ! యింకా వుంటారా వూళ్లో'.

'ఇంకో నాల్గురోజులు షూటింగ్ ! తర్వాత వెళ్లిపోతా మద్రాసుకు....ఆ తర్వాత కోయంబత్తూరు వెళ్లాలి...'

'మళ్ళీ ఎప్పు డొస్తారు ?....'

'వచ్చేనెల 17 వ తారీఖున.'

'బై బై ...నేను మళ్లీ అప్పుడు ఫోను చేస్తాను....మా లలితకు చెప్తాను నేను మీతో మాట్లాడా నని....'

'ఊ, అలాగే !'

టెలిఫోన్‌లో - శబ్దం ఆగింది - వర్షం వెలిసినట్లు - ఎవ రీ పిల్ల ? ....గ్లాసులో బీరు పూర్తిగా త్రాగేశాడు శ్యామసుందర్....సిగరెట్టు ముట్టించాడు....

అబ్బ !.... సినీమా నటకు లంటే ఎంతసరదా పిల్లలకి ? హోటలు మేనేజరు మంచి తప్పుచేశాడు ?....శ్యామసుందర్ నటకుడుకూడా యిక్కడే బస చేస్తాడు కాబోలు !...ఒకటే మాటలు - ఏమిటో కథ...ఈల వేశాడు శ్యామసుందర్...

సినీమా శ్యామసుందర్‌కీ తనకీ వ్యత్యాసం....

వయస్సులో బహుశా ముప్పైఏండ్లు

మనస్సులో వివిధ దృక్పథాలు...

అతనికి నటన - తనకు వ్యాపారం !

జీవితంలో కొందరి తప్పులు — కొందరికి మేలు !

ప్రతీ హోటలుకు ఇటువంటి మేనేజర్లు ఉంటే - హాయ్! నవ్వుకున్నాడు శ్యామసుందర్ !

చేతిలో గ్లాసుతో, మైకంలో సరదాగా నృత్యంచేశాడు ఒంటరిగా గదిలో!

తలుపు చప్పుడు !

బోయ్ !

ఇంకొక సీసా ?....పదివేల నష్టం పదిలంగా మరిచిపోయాడు శ్యామసుందర్ !

* * *





శకుంతల పడుకుంది - పుచ్చపువ్వు వెన్నెల్లో ....ఆకాశంవైపు చూసింది - చంద్రుడు నవ్వాడు ... శ్యామసుందర్ నవ్వినట్లుంది - సినీమాలో నటిస్తే ఎంత బాగుంటుంది - అమ్మ ఒప్పుకోదు - ఛీ వెధవబ్రతుకు ?...

గొప్పవాళ్ళతో మాట్లాడ్డం గొప్ప!... శ్యామసుందర్‌తో ఫోనులో మాట్లాడ్డం గొప్ప !.... ఎవరు మాట్లాడగలరు ?

కూనిరాగం - తుమ్మెదలా గానం - శకుంతల ఆనందంగా మెత్తటి పరుపుపై కాళ్ళు రాసుకుంటూ - ఒళ్ళు నిమురుకుంటూ కలల్లో ఒరిగింది.

* * *

## వచ్చిన నెల 17వ తారీఖు

'హల్లో!'

'హల్లో!'....

'మీరు వూళ్ళో ఉన్నారా లేదా అని తటపటాయించి, టెలిఫోను చుట్టూ మూడుసార్లు ప్రదక్షణం చేసి, చివరకు ....(నవ్వు).

'ఉహూఁ మీరు బాగా నవ్వుతారే?'

'అలాగే అంటారు అంతా...మా అమ్మా, లలితా, తమ్ముడు...మాక్లాసులో అబ్బాయిలు....నన్ను తెగ చూస్తారండి ....ఒకటే గొడవ...ఏదోవంకన వచ్చి పలకరిస్తారు....!'

'అంటే....మీరు అంత అందకత్తెలా....'

'నాతలకాయ....ఏమిటో, మగవాళ్ళే అంతలెండి....మొన్న పత్రికలో మీరు దొంగలా తీయించుకున్న ఫొటో చూశాను, భయం వేసింది....రాబోయే సినీమా ఎలా ఉంటుందో!

'నాకు ఖూనీ చెయ్యడం సరదా.... సినీమాల్లో లెండి!'

'చచ్చాం ! నాకు భయం వేసింది.... నన్ను చేస్తారేమో నని........ మీరు మద్రాసులో ఎన్నాళ్ళనుంచీ ఉంటున్నారు....?'

'అబ్బో చాలారోజులు నుంచీ'

'మీరు 'విశ్వం' గారి నెరుగుదురా ? డిటెక్టివ్ కథలు రాస్తారు !'

'ఆ....ఆ....తెలుసు?' శ్యామసుందర్ కళ్లు మిటకరించాయి, చక్కగా జారుతున్న అబద్ధం తలచుకుంటూ'.

'అబ్బ! ఆయన ఏం చక్కగా రాస్తాడండి .... వెంట్రుకనుంచి మనిషి హత్య పట్టుకునే కల్పన–బ్రహ్మాండం ....కదండి?'

'అవును.'

'మాయింటి ప్రక్క పుస్తకాల దుకాణం ఉంది...అక్కడ డిటెక్టివ్ కథల పుస్తకాలు – అణా అద్దె కిస్తారు... చదివి యిచ్చేయ్యాలి అంతే....ఆకొట్టులో ఉన్న పుస్తకా లన్నీ చదివేశానండి ....ఒక్కొక్కసారి భయంవేస్తుందండీ, చుట్టూ హత్యలు జరుగుతున్నట్లు'....

'మీ రెప్పుడైనా హత్య చేశారా ?'

'నేనా .... బాగుందే .... మీరు చాలా హాస్యంగా మాట్లాడుతారే ...ఛ, నాకు

చేతకాదండి...ఊ....ఏమన్నా విశేషాలు చెప్పండి?'

'ఏముంది .... మీరు ఎక్కడ కనిపిస్తారు....కలుసుకోవాలంటే!'

'అబ్బే అదిసాధ్యంకాదు....కాళ్ళకు సంకెళ్ళుగా!....'(నవ్వు)

'మీరు బలేగా నవ్వుతారు....సముద్రపు నురుగలా — హంస శరీరంలా....తెల్లటి అర్టుపేపరులా....మల్లుచొక్కాలా!'

'ఓహో మీకు కవిత్వంకూడా వచ్చా!'

'నేర్చుకున్నా విశ్వం దగ్గర!'

'విశ్వంమీకుబాగాపరిచయమేనాండి!'

'ఊ....చచ్చేటంత?

నిట్టూర్పు

'అదేం నిట్టూరుస్తున్నారు?'

'ఆ....ఏమీలేదు....అదొక కథ....!

'ఏమిటా కథ....?'

'నాకు మద్రాసు వచ్చేయ్యాలని ఉందండి?'

'వచ్చేయండి నాతో!'

'వస్తే విశ్వంగారిని పరిచయం చేస్తారా?'

'ఏం! విశ్వం అంటే మీకు....?'

'అదొక కథ....పోనీలెండి.'

'అరే, చెప్పండి .... నేను సాయం చేస్తా.'

'ఆయన ఎలా వుంటారు?'

'బొద్దుగా - లావుగా - 30 ఏండ్లు.'

'పెళ్ళయ్యిందా?'

'ముగురు పిల్లలు'....



'ఆఁ....పెళ్ళికాలేదని రాస్తాడు నాకు!'

'మీకు విశ్వం ఉత్తరాలు వ్రాస్తాడా?'

'చాలా రాశాడులెండి....ఇంత అబద్ధం రాస్తాడనుకోలేదు!....

'అరెరే!........ఈ సారి కనిపిస్తే చీవాట్లు పెడతాలెండి!'

'వద్దండి .... నా సంగతి ఆయనకు చెప్పకండి!....(నిట్టూర్పు)'

'మీకు చాలా బాధకలిగించానుకదు!'

'మీరేం కలిగించలేదు. నా బ్రతుకే బాధలమయం. నమస్కారం ...'

'నా కొకసారి కనిపించరూ?'

'ఊహుఁ...'

శబ్దం మానింది....టెలిఫోను రిసీవరు ఎడాపెడా పరిశీలించి, నోరు చప్పరించి, పరుపుమీద ఒరిగాడు శ్యామసుందర్!....ఎందుకు రావాలి యిక్కడికి? 17వ తారీఖున వస్తానన్నందుకేనా....వ్యాపారంలేదు - కాని మనసు...

క్రిణ్...క్రిణ్....

'మళ్ళీ ఎప్పుడు వస్తారు యీ వూరు?'

—ఆడకంఠం.

'మీరు ఎప్పుడు రమ్మంటే అప్పుడు.'

'మరో నెల్లాళ్ళల్లో వస్తారా?'

'ఊఁ....వచ్చేనెల 25వ తారీఖుకు వస్తా—'

'బై....బై....(ఏడ్పు')

'అదేం ఏడుస్తున్నారు....'

'బాధ....తలనొప్పి.... వికారం....ఏమిటో మనసులో...నమస్తే.'



టెలిఫోన్ బంద్

శ్యామసుందర్ ఆలోచనలోపడ్డాడు.. ఇదొక వింతప్రకృతి - మీసం దువ్వుకున్నాడు....'బోయ్! బీర్!....'

సీసా....గ్లాసు...గ్లాసులోనురగ....ఆమె నవ్వులా .... త్రాగేడు ... ఆమె కన్నీరు మ్రింగినట్లయింది — శ్యామసుందర్ గదిలో నృత్యం చేశాడు కూనిరాగం తీస్తూ....

## పైనెల 25వ తారీఖు

'నేను, శకుంతలనండీ!'

'అరె! రాగానే పట్టుకున్నారే...ఇంకా బూట్లు విప్పుకుంటున్నా.'

'ఏమండీ! మీ బూటు ఖరీదు ఎంత?'

'జ్ఞాపకం లేదు .... ఇరవై అయిదు రూపాయి లుంటుంది!'

'మరి మీకు హేటుందా?'

'ఆఁ'

'దాని ఖరీదు?'

'బహుశా 30 రూపాయిలుంటుంది!'

'ఊ....ఎలాగైనా డబ్బున్న వాళ్లుగా మరి—నాకు మీ డబ్బంతా కావాలి...యిస్తారా?—'

'ఓ...ఎంత కావాలి?—'

'అంతా....(నవ్వు)....'

'మీరు బలేగా నవ్వుతారు....బట్టతల మీద చిలిపిగా వెంట్రుకలు ఊగినట్లు'

'అ ధేం పోలికలండీ?'

'విశ్వం సహవాసం.'





"ఏమండీ రాత్రి నాకు మంచి కలొచ్చిందండీ, మీరు నా కొక బెనారస్‌చీరె కొన్నారట"
"అలాగా, అయితే ఈ సారి కలలో దాన్ని కట్టుకో"

'అచ్చు విశ్వం కూడా యిలాగే రాస్తాడు.'

'అలాగే .... అదృష్టవంతులు .... మీరు అతని వన్నీ చదువుతారు — నేను అతన్ని చూస్తాకనుక ఏమీ చదవను!'

'ఏమండీ! మీకు విశ్వం కనిపించాడా మద్రాసులో.'

'ఆఁ....మీ సంగతి చెప్పాను!'

'చెప్పారా?....ఏమన్నారు?'

'నవ్వాడు! అంతే....'

'ఇంకేమీ అనలేదూ....చెప్పండీ....చెప్పరూ....చెప్పకపోతే నేను మీతో యింక మాట్లాడను ఫోనులో!'

'బాబోయి, అంతపని మాత్రం చెయ్యకండి....చెబుతా....అతనికి ఏదో బాధగా వుందిట....హత్య చేసుకుంటానన్నాడు....'

'ఏమిటీ ?'....

'అదే....నేను నమ్మలేదు....పోరా ....అన్నాను....కథల్లో హత్యలు చేసే వాడు, నిజంగా చేయగలడా? పోనీ అనుకున్నా....కాని నిజంగా....'

'ఏమిటీ ?....ఏమయింది ?...'

'విశ్వం...హత్య...చేసుకున్నాడు'

'ఆఁ....మీకు శవం కనిపించిందా ? ....నిజమే ?...(ఏడ్పు)'

'ఏడ్వకండి...అతని భార్యా పిల్లలూ పుట్టింటికి వెళ్లారు...అతను గదిలో కనిపించలేదు....ఊళ్లో లేడు...ఎక్కడా జాడ లేదు. చనిపోయా డని అనుకుంటు న్నా రంతా....కథల్లో హత్యలు చేయడం యిష్టం కాబట్టి, అతను హత్య చేసుకుని ఉంటా డని అంతా అంటున్నారు—'

'నాకు చాలా బాధగా వుందండి—ఈ వార్త నాకు ఎందుకు చెప్పారు? అతనిమీద అభిమానంతో యింతకాలం వున్నా—మా అమ్మా నాన్నా బలవంతంగా నాకు పెళ్ళి చేస్తారట—ఇప్పుడేం చేసేది—ఒప్పుకోక తప్పదు—అయినా ఈ బాధ—అందుకే రెండు మూడు నెలల నుంచి అతని డిటెక్టివ్ కథలు ఎక్కడా కనిపించడం లేదు—నా బాధ —(ఏడ్పు)'

'ఏడ్వకండీ! — నాకూ ఏడ్పుగా వుంది మిమ్మల్ని చూస్తుంటే.'

'విశ్వం అంటే—విశ్వం–(ఏడ్పు) నమస్తే–మళ్ళీ ఎప్పుడైనా మాట్లాడుతా!'

టెలిఫోన్ బంద్—

శ్యామసుందర్ ముఖంమీద కమ్మిన చెమట బిందువులు తుడుచుకున్నాడు. ఎందుకీ అబద్ధం ?—విశ్వం ఎవరు ? అతన్ని ఎందుకు హత్యచేశాడు ఆ అమ్మాయి కోసం ? — తన మనః ప్రవృత్తి ఆమె విచిత్ర సంభాషణలాగా మరీ చిత్రం!

క్రిణ్—క్రిణ్—

'ఏమండీ !—వచ్చేనెల 16 వ తారీఖున మీ రీ వూళ్ళో వుండాలి.' అదే కంఠం.

'ఎందుకు ?'

'నా పుట్టినరోజు—ఆ రోజు – మీరు మా యింటికి వద్దురుగాని.'

'అలాగే !'

టెలిఫోను నిశబ్దంగా కూర్చుంది మళ్ళీ....

ఎదురుగా గోడమీద ఒక అజంతా దృశ్యం!....ఒక లేడి పరుగు!....లేడి కళ్ళల్లా ఆమె కళ్లు....మాటలు .... ఒక ఊహా చిత్రం....శకుంతల....సిగరెట్టు పొగ రింగుల్లో తిరిగింది — శ్యామసుందర్ ఆలోచనల్లో—

**కథలో-ఆఖరినెల-16వ తారీఖు**

'ఏమండీ!'

'హల్లో–శకుంతలా! కులాసా?'

'ఆ...ఏంచేస్తున్నారు?'

'బీరు అనే ద్రావకం త్రాగుతున్నా.'



'బాగుంటుందాండి?'

'ఆఁ—'

నాకు కొంచెం ఫోనులోపొయ్యరూ?'

'హి హి హి — బాగా మాట్లాడతావు కదూ నువ్వు!'

'ఏమండీ, మీ సినీమా దొంగ, చూశాను–చాలాగొప్పగా నటించారు–నేను ఎదురుగా ఉంటే ఒకదండ వేసి, చప్పట్లు కొట్టేదాన్ని.'

'అబ్బ, ఏం చమత్కారం!'

'నాసంగతికేం గాని—మీ అబద్ధాలన్నీ బయట పడ్డాయి'

'ఆఁ హిహిహి!' శ్యామసుందర్ బిగ్గరగా నవ్వాడు మనస్సును సర్దుకుంటూ.

'విశ్వం హత్య చేసుకున్నా డన్నారు కదూ!'

'అవును'

'అతను ఈవూళ్ళో ఉన్నాడు'

'అలాగా—'

'మీదగ్గరికి తీసుకువస్తాను.'

'హిహిహి !'

'ఎందుకా దొంగనవ్వు ?'

'అబ్బే ! ఏంలేదు'

'చూడండి—నేను ప్రేమించి పెళ్లి చేసుకుంటున్నా—'

'వెరీగుడ్ !'

'మా అమ్మా, నాన్నా ఒప్పుకున్నారు కూడా !'

'చాలా బాగుంది—'

'ఈవాళ నాపుట్టినరోజు కదూ—మా యింటికి రావాలి'

'ఎక్కడ మీ యిల్లు ?'

'కోటీపక్కన సందులో మొదటి బంగళా'

'తప్పకుండా వస్తా !'

'వచ్చేక చూద్దురుగాని మీ విశ్వాన్ని. అతనుకూడా టీ పార్టీకి వస్తాడు.'

'చాలా బాగుంది—విశ్వం హిమాలయాలకుపోయి హత్యచేసుకుందా మని వెళ్లాడుట....అక్కడ బాగా చలిగా ఉందని తిరిగి వచ్చేశా డని అన్నా రంతా ....అయితే ఈ ఊళ్ళో ఉంటున్నాడా ....ఏంచేస్తున్నాడు ?'

'మెడికల్ కాలేజీలోచదువుతున్నాడు?'

'ఇన్నేళ్లువచ్చాక ఇంకాచదువేమిటి?'

'అదే సాయంత్రం అడగండి.... తప్పక రండి టీ పార్టీకి. బై బై....'

టెలిఫోన్ బంద్.

శ్యామసుందర్ ముఖం వెల వెల పోయింది....కథ అడ్డంతిరిగిందే! ....

'బోయ్ — బీర్ !'

సీసాలు - గ్లాసులు - హాజరు!

'ఎవరీ శకుంతల ?—ఏమి టీ కథ? సాయంత్రం వెళ్ళాలి పార్టీకి—ఆ విశ్వం నన్నెరగనంటే—తెలిసే వుంటుంది ? ఏంచేస్తాం—'బీరు గ్లాసుతో నృత్యం చేస్తూ కూనిరాగం తీశాడు శ్యామసుందర్ —క్వాయ్—క్వాయ్—క్వాయ్—

'ఎవరో వచ్చారూ ?—రండి—'

'ఓరి! నువ్వా?—'

'అవును నాన్నా....'

'టెలిఫోన్ చెయ్యకుండావచ్చావేం?'

'ఆఁ....చేసే దేమిటి అని....'

'వీ రెవరు?'

'లలిత-బి.ఏ. చదువుతోంది నాన్నా..

'ఏమండీ! యీ హోటల్లో శ్యామసుందర్ అనే సినీ నటుడు ఉంటున్నాడు కదూ—'

(బోయ్ సీసాతో ప్రవేశం)

'బోయ్! శ్యామసుందర్ అనే సినీ నటుడు ఈ హోటల్లో ఏ గదిలో ఉంటారు?'

'ఈ హోటల్లో ఎవరూ లేరండీ? ....ఈయనే శ్యామసుందర్!'

'ఆఁ' శకుంతల ఆశ్చర్యంగా శ్యామసుందర్ వైపు చూసింది!

'నువ్వేనా శకుంతల?'

'అవునండీ—కాని నా అసలు పేరు లలిత—'

'సరదాగా టెలిఫోనులో శకుంతల అనే పేరుతో మాట్లాడతా'

'బలేతమాషా!—'

'మీ కంటేనా? సినీ నటుడని నటించారే!'

'అదేమిటి నాన్నా?'

'అదో కథరా—చెబుతా..ఈ అమ్మాయితో పరిచయం ఎలా?'

'నేనంటే యిష్టం!'

'కథలురాసే విశ్వం గురించి అబద్ధాలాడేది!....యీయనేనా?'

'ఏరా నువ్వు కథలు రాస్తావా?'

'లేదు నాన్నా! ఈఅమ్మాయికి విశ్వం అంటే యిష్టమని తెలిసి, నా పేరూ అదేగా – నేనే ఆ రచయిత నన్నాను!'

'నువ్వు విశ్వం కాదూ!' కోపంతో లేచింది లలిత–

'నన్ను క్షమించు లలితా!'

'ఈవేళ మా యింట్లో టీపార్టీ లేదు. క్షమించండి-మీ యిద్దరూ రానక్కర్లేదు'

లలిత నిష్క్రమణ కోపంతో.

విశ్వం పాలిపోయిన ముఖంతో వెంటనే బయటికి నడిచాడు, తండ్రికేసి భయంగా చూస్తూ.

శ్యామసుందర్ నవ్వుకున్నాడు..... బీర్ గ్లాసు చూసి, త్రాగుతూ—

టక్ టక్ టక్ గుఱ్ఱపు డెక్కల చప్పుడు! బొంబాయిలో!

'బోయ్! బొంబాయికి సాయంత్రం బండిలో ఒకటిక్కట్టు ఫస్టుక్లాసు బుక్ చెయ్యి!' శ్యామసుందర్ అలసటగా నీల్గాడు...

సిసాలు ఖాళీ...గ్లాసులు ఒరిగాయి–టెలిఫోను గాలిలో తిరుగుతోంది–శకుంతల కదులుతోంది—శకుంతల కాని లలిత—విశ్వం కాని విశ్వం—శ్యామసుందర్ కాని శ్యామసుందర్!–

మనిషికాని మనిషిని

టెలిఫోను సాధించింది!

'లోకంతీరు!!–బోయ్!'–తూలుతూ ప్రక్కమీద ఒరిగాడు శ్యామసుందర్!*



# ఎవరి పని?

దస్తూరి మేస్టరు సెర్గెయ్ కసితోనిచ్ అఖీనియెవ్ తన కుమార్తె నతాల్యను హిస్టరీ, జాగ్రఫీల మేస్టరయిన ఇవాన్ పెత్రోవిచ్ లొషాదినిఖ్ కిచ్చి చేశాడు. పెళ్లి విందు దివ్యంగా జరిగింది. ఆడారు, పాడారు, హాలులో నృత్యాలు చేశారు. ఈ అక్కరకుగాను క్లబ్బునుంచి అరువు తెచ్చిన వెయిటర్లు నల్ల ఫ్రాక్ కోటులూ, మాసిపోయిన తెల్ల నెక్ టైలూ ధరించి, వెర్రివాళ్లలాగా అటూఇటూ హడావుడిగా తిరిగారు. మాటల సందడి అంతటా మారుమోగిపోయింది. బయట కొందరు జనం మూగి కిటికీలగుండా లోపలికి చూశారు; వాళ్లకి లోపలికి వచ్చే అర్హత లేదు.

సరిగా అర్ధరాత్రి సమయాన పెళ్లిపెద్ద అఖీనియెవ్ ఆఖరు భోజనానికి ఏర్పాట్లన్నీ సవ్యంగా జరిగాయో లేదో చూడటాని కని వంటసాలకు వెళ్లాడు. వంటసాల పైనుంచి కిందికి పొగతో నిండి ఉన్నది. ఆ పొగలో బాతుల వాసనా, పొట్టి బాతుల వాసనా, ఇంకా అనేక వాసనలూ ఉన్నాయి. రెండు బల్లలమీద తిండి పదార్థాలూ, పానీయాలూ అడ్డదిడ్డంగా పేర్చిపెట్టినా కనుల పండువుగా ఉన్నాయి. వంటమనిషి మార్ఫా లావుపాటిది. ఆమె మొహం ఎర్రగా ఉంటుంది. ఆమె ఆ బల్లలమీద ఏదో అమర్చుతున్నది.

అఖీనియెవ్ చేతులు రుద్దుకుంటూ, పెదవులు నాక్కుంటూ, "ఏదీ, స్టర్జిన్ చేప చూపవే! ఎంత కమ్మని వాసన! వంటఇల్లంతా తినెయ్యా లనిపిస్తున్నది! సరేగాని, స్టర్జిన్ చూపూ!" అన్నాడు.

మార్ఫా ఒక బెంచీవద్దకువెళ్లి, నూనె మరకలతో ఉన్న ఒక కాగితం ఎత్తింది. ఆ పత్రికకాగితంకింద పెద్ద పళ్ళెంలో ఒక పెద్ద, కొవ్విన స్టర్జిన్ చేప ఉన్నది, దాని చుట్టూ మసాళాకింద కాయలూ, దుంపలూ అమర్చి ఉన్నాయి. అఖీనియెవ్

అంతోన్ పి. చెఖవ్